ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 30 నవంబరు 2024



పనులు పూర్తి చేయండి: ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రి అదనపు భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం భవన నిర్మాణ డిజైన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల్లో నాణ్యత లోపించరాదన్నారు. నిర్ణీత గడువులోగా వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు. రోజూ పనులు జరిగేలా చూసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో పీవో వెంట సూపరెండెంట్ శ్రీనివాసరావు, ఏఈలు ఉన్నారు.

వణికిపోతున్నారు..

ఆంధ్రజ్యోతి విజిట్



గరుగుబిల్లి: శిథిలావస్థలో ఉన్న రావివలస ఎస్సీ బాలుర వసతి గృహం

శిథిలావస్థలో భవనాలు.. చాలీచాలని గదులు.. నిరుపయోగంగా మరుగుదొడ్లు.. పెచ్చులూడుతున్న స్లాబులు.. ఊడుతున్న తలుపులు.. కిటికీలు.. ఇదీ జిల్లాలోని పలు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిస్థితి. కనీస మౌలిక వసతులు కొరవడడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వసతి సమస్య వారిని తీవ్రంగా వేధిస్తోంది. చాలాచోట్ల మంచాలు లేక విద్యార్థులు కటిక నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేకపోవడంతో చలికి వణికిపోతున్నారు. మరోవైపు దోమల బెడద తప్పడం లేదు. మొత్తంగా వారు కంటి నిండా నిద్రించలేని పరిస్థితి. జిల్లాలోని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా పలు సమస్యలు వెలుగుచూశాయి.

- పూర్తి వివరాలు 6వ పేజీలో...

- ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతులు కరువు
- కటిక నేలపైనే విద్యార్థుల పడక
- ఓ వైపు చలి.. మరోవైపు దోమలు
- కంటి నిండా నిద్రించలేని పరిస్థితి..



సీతంపేట రూరల్: గురుకుల బాలుర పాఠశాలలో నేలపై పడుకున్న గిరిజన విద్యార్థులు

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్

6లో

- హోరాహోరీగా క్రీడా పోటీలు
- సత్తాచాటుతున్న పోలీస్ జట్లు

అర్సలాన్‌ఖాన్ అజేయ సెంచరీ

6లో

- ఛండీగఢ్ సునాయాస విజయం
- ఛత్తీస్‌గఢ్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు

మెస్ చార్జీలు పెంచి..

మెరుగైన మెనూ అందిస్తాం



విద్యార్థినులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

- మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెస్ చార్జీలు పెంచి విద్యార్థులకు మెరుగైన ఆహారం అందిస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పాచిపెంటలో రూ.1.75 కోట్ల ఐటీడీఏ నిధులతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వసతి అదనపు భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్బులు, షాంపులు, తదితర కాస్మెటిక్ చార్జీలు ఇకపై విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే జమవుతాయని తెలిపారు. చలికాలంలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న సీఎం చంద్రబాబు త్వరలో వారికి రగ్గులు, బెడ్ షీట్లు, కంచాలు, గ్లాసులు అందజేస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో గిరిజన గ్రామాల్లో రెండు వేల రహదారుల నిర్మాణానికి రూ.2,500 కోట్లు మంజూరు చేశారన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. తమ వసతిగృహంలో తగిన స్థాయిలో మరుగుదొడ్లు లేవని పదో తరగతి విద్యార్థిని కుమారి తెలియజేయగా.. అదనపు మరుగుదొడ్లు, క్రీడామైదానం, ప్రహరీ నిర్మాణాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి గిరిజన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పి.ప్రసాద్‌బాబు, నాయకులు పోలినాయుడు, సురేష్, సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. రైతుల్లో గుబులు

జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉన్నా.. చివరిదశలో తుఫాన్ కారణంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. మూడు, నాలుగు రోజులు తెరిపి ఇచ్చిఉంటే పంటను సురక్షితంగా ఇళ్లకు చేర్చుకునేవాళ్లమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అక్కడక్కడా కురిసిన జల్లుల కారణంగా వరిపనలు తడిచిపోయాయి. కొంతమంది రైతులు వరి కోసినా.. కూలీల కొరతతో కుప్పలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం తడిచి రంగుమారుతుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

- తుఫాన్‌తో జిల్లా అంతటా చిరుజల్లులు
- ఇంకా పొలాల్లోనే వరి పైరు
- తడిచిపోతే నష్టం తప్పదని భయం



పాలకొండ:నూర్పులు పూర్తి చేసుకొని కల్లాల్లోనే ఉన్న ధాన్యం



భామినిలో పత్తిని ఏరుతున్న రైతులు

పార్వతీపురం/పాలకొండ/భామిని/వీరఘట్టం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం మన్యం జిల్లా అంతటా చిరుజల్లులు కురుస్తున్నాయి. ఖరీఫ్ పంట పంట పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత నుంచి చిరుజల్లులు మొదలయ్యాయి. పొలాల్లోను, కల్లాల్లోను ఉన్న పంటను దక్కించుకొనేందుకు రైతాంగం పరుగులు తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 60 శాతానికి పైగా వరి పంట కోత పూర్తయింది. మరికొంతమంది యంత్రాలతో కోసి కుప్పలు వేస్తున్నారు. పనాలను కుప్పలు వేస్తున్నారు. ఇప్పటికే పంట నూర్పుడి పూర్తి చేసుకున్న రైతులు ధాన్యాన్ని భద్రపరిచేందుకు అగచాట్లు పడుతున్నారు. మరికొంతమంది రైతులు వరి కుప్పల పైన టార్పాన్లు కప్పారు. చిరుజల్లులైతే పర్వాలేదుగానీ.. భారీ వర్షం కురిస్తే రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి పంటను సాగవుతోంది. కొంతమంది రైతులు కోసిన వరిచేను కూలీల కొరతతో కుప్పలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో వర్షం కురిస్తే పనాలు తడిసి నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. పత్తిపంట కోసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కూలీల కొరతతో పత్తిని ఏరలేదు. వర్షాలు పడితే పత్తిపంట నష్టం వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

- సీతంపేట రూరల్/సాలూరు రూరల్: తుఫాన్ ప్రభావంతో సీతంపేట, సాలూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గాలులు వీస్తుండడంతో మన్యం వాసులు చలికి వణికిపోతున్నారు. తుఫాన్‌పై ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో వరి కోతలను గిరిజన రైతులు కొద్ది రోజులు పాటు వాయిదా వేసుకున్నారు. అక్కడక్కడ కోతలు జరిగిన చోట చేనును కుప్పలుగా వేసి టార్పాలిన్లతో కప్పి ఉంచారు. భారీ వర్షం కురిస్తే పంటను నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

డీఆర్‌వోగా హేమలత



పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారిగా కె.హేమలత నియామకమయ్యారు. గతంలో పార్వతీపురం ఆర్డీవోగా పనిచేసిన ఆమె పదోన్నతిపై జిల్లా రెవెన్యూ అధికారిగా ఇక్కడకు రానున్నారు. అంతకముందు పాలకొండ ఆర్డీవోగా కూడా పనిచేశారు. శుక్రవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ఆమెతో ఫోన్‌లో మాట్లాడగా.. ప్రభుత్వం తనపై ఎంతో నమ్మకంతో పార్వతీపురం మన్యం జిల్లాకు డీఆర్వోగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక ఆదేశాల మేరకు జిల్లా ప్రజలకు రెవెన్యూ శాఖ ద్వారా పూర్తిస్థాయిలో సేవలందిస్తానని తెలిపారు.

- డిప్యూటీ కలెక్టర్‌గా ధర్మచంద్రారెడ్డి

కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా పి.ధర్మచంద్రారెడ్డి నియామకమయ్యారు. గతంలో ఆ స్థానంలో కేశవనాయుడు ఇక్కడ పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో ధర్మచంద్రారెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

పర్యాటకంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. సీతంపేట పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లోని జలపాతాలు, సందర్శనీయ ప్రదేశాలను కలుపుతూ సర్క్యూట్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, వేగావతి, సువర్ణముఖి నదీ ప్రాంతాలు, వీరఘట్టం వద్ద ఉన్న పెద్ద చెరువు తదితర ప్రదేశాల్లో వాటర్ పార్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. భామినిలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. ● మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా నివారణకు పోలీస్, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖలతో జాయింట్ ఆపరేషన్ నిర్వహించాలని, బస్సులు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్నిఫర్ డాగ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్లు వినియోగించాలన్నారు. సారా తయారీదారులపై పీడీయాక్ట్, బైండోవర్ కేసులు పెట్టాలని ఆదేశించారు. ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ, డీఎస్పీ తదితరులున్నారు.

పోలి పాడ్యమికి సన్నద్ధం

- తోటపల్లిలో ఏర్పాట్లు

గరుగుబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానంలో వచ్చేనెల 2న పోలి పాడ్యమి వేడుకలు నిర్వహించనున్నారు. కార్తీకమాసం ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో నాగావళి నదీ తీరానికి తరలివచ్చి పుణ్య స్నానాలు చేయనున్నారు. నదిలో దీపాలు వెలిగించనున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకోనున్నారు. అర్ధరాత్రి నుంచే భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో నదీ తీరంలో స్నానాలు ఆచరించేందుకు వీలుగా విద్యుత్ అలంకరణ పనులు చేపడుతున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. యంత్రాలతో పరిసర ప్రాంతాలను చదును చేసి.. శుభ్రం చేయిస్తున్నామని వెల్లడించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

ఒకరోజు ముందే ...

- నేడే పింఛన్ల పంపిణీ
- రూ. 59 కోట్లు సిద్ధం



పార్వతీపురం/సాలూరు రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛనుదారులకు ఒక రోజు ముందుగానే చేతికి డబ్బులు అందనున్నాయి. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 30న (శనివారం) ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీకి అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో మొత్తంగా 14 రకాల పింఛనుదారులు 1,42,119 మంది వరకూ ఉన్నారు. వారికి పింఛను డబ్బులు అందించడానికి శుక్రవారం రూ. 59.07 కోట్లను బ్యాంకుల నుంచి విత్ డ్రా చేశారు. సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులతో పింఛను అందించనున్నారు. ఈ నెల 30న పింఛను అందుకోని వారికి వచ్చే నెల రెండున పంపిణీ చేయనున్నారు.

- ఏదైనా కారణంతో పింఛను అందుకోకుంటే మూడు నెలల లోపు ఎప్పుడైనా తీసుకోవచ్చనే నిబంధనను అధికారులు అమలు చేయనున్నారు. ఇప్పుడు పింఛను తీసుకోని వారికి వచ్చే నెల బకాయి కలిపి అందించనున్నారు. దీంతో పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత నెల అందుకోని వారికి ..

జిల్లాలో గత నెలలో 489 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో పింఛన్ సొమ్ము అందుకోలేకపోయారు. వారికి కూడా నేడు అందించనున్నారు. జియ్యమ్మవలస మండలంలో 24 మంది, గుమ్మలక్ష్మీపురం ఏడుగురు, బలిజిపేటలో 36, భామిని 66, గరుగుబిల్లి 97, కొమరాడ 28, వీరఘట్టం 41, మక్కువ 11 మంది, కురుపాంలో ఐదుగురు, పాచిపెంట 15, పాలకొండ 53, పార్వతీపురంలో 46, సాలూరులో 30 మంది గత నెలతో కలిపి పింఛన్ సొమ్ము అందుకోనున్నారు.

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైసీపీ పాలనలో లబ్ధిదారులు ఒక నెల పింఛను అందుకోకపోతే ఆ సొమ్మును ప్రభుత్వం వెనక్కి తీసు కొనేది. రెండో నెల ఆ పింఛను సొమ్ము లబ్ధిదారులకు అందించే వారు కాదు. అయితే కూటమి ప్రభుత్వం మూడు నెలల పాటు వెసులుబాటు కల్పించడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శతశాతం పంపిణీకి ప్రయత్నిస్తాం

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒకరోజు ముందే లబ్ధిదారులకు అందించనున్నాం. శనివారం దాదాపు శతశాతం పంపిణీకి కృషి చేస్తాం. ఎవరైన మిగిలి ఉంటే సోమవారం పంపిణీ చేస్తాం. మూడు నెలల్లోగా పింఛను తీసుకోవాలనే నిబంధన అమల్లోకి తెస్తున్నాం.

- వై.సత్యంనాయుడు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ

సంక్షామ హాస్టళ్లు


శ్లాబు పెచ్చులు ఊడిన దృశ్యం

- కనీస సదుపాయాలు కరువు
- ఇరుకు గదులే దిక్కు
- తలుపులు, కిటికీలు ఉండవు
- ఫ్యాన్లు తిరగవు.. దీపాలు వెలగవు
- మరుగుదొడ్లు, స్నానాల గదుల కొరత
- విద్యార్థులకు అరకొరగా దుప్పట్ల పంపిణీ
- చలికి వణికిపోతున్న వైనం

ఆంధ్రజ్యోతి విజిట్

జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. చాలా హాస్టళ్లు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు మగ్గిపోతున్నారు. చాలాచోట్ల ఫ్యాన్లు తిరగడం లేదు. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. దుప్పట్లను అరకొరగా పంపిణీ చేశారు. ఒక దుప్పటిని ముగ్గురు కప్పుకుంటున్నారు. కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో దోమలు లోపలకు వచ్చేస్తున్నాయి. మంచాలు లేక విద్యార్థులు కటిక నేలపైనే నిద్రపోతున్నారు. జిల్లాలోని హాస్టళ్లను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా పలు సమస్యలు వెలుగుచూశాయి.

ఊడిపడుతున్న పెచ్చులు..

గంట్యాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ఎస్సీ బాలురు వసతి గృహం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. కిటికీలకు తలుపులు లేవు. చలి ఎక్కువగా ఉండడంతో కిటికీలకు విద్యార్థులు తమ దుప్పట్లను అడ్డుగా పెడుతున్నారు. ఇక్కడ 61 మంది విద్యార్థులు ఉన్నారు.



మంచాలు లేవు..

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహారాణి పేటలోని బీసీ బాలుర వసతి గృహంలో 6 నుంచి 10వ తరగతికి చెందిన 70 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు పడుకునేందుకు మంచాలు లేవు. నేలమీద చాపలు వేసుకుని నిద్రపోతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో చలికి వణికిపోతున్నారు. పెచ్చులూడిన గోడలు దర్శనమిస్తున్నాయి.

ఇరుకు గదే దిక్కు..


పాఠశాల వంట, స్టాక్ గదిలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

భోగాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భోగాపురం బీసీ బాలురు వసతి గృహం పూర్తిగా శిథిలమైంది. దీంతో పాఠశాలలోని ఇరుకైన గదిలో 70 మంది విద్యార్థులు తలదాచుకుంటున్నారు. ఈ గదికి కిటికీలు లేవు. చలికి వణుకుతూ నేలపైనే నిద్రిస్తున్నారు. స్టాక్, వంట గదిని కూడా విద్యార్థులు పడక గదిగా ఉపయోగించుకుంటున్నారు.

సొంత భవనాలు లేవు..

గజపతినగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పట్టణంలో ఆరు వసతి గృహలు ఉన్నాయి. కొన్నింటికి సొంత భవనాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో 3 నుంచి పదో తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రగ్గులు వచ్చి మూడేళ్లు గడుస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక జత దుప్పట్లు పంపిణీ చేట్టింది. విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు లేవు. ఇంటర్, డిగ్రీ కళాశాల వసతి గృహంలో 120 మంది విద్యార్థులకు ఏడు మరుగుదొడ్లే ఉన్నాయి. వీటిలో కొన్ని పాడయ్యాయి. కాస్మోటిక్ చార్జీలు 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రగ్గులు లేక విద్యార్థులు చలికి వణికిపోతున్నారు.


ఒక్కొక్క దుప్పటిని ఇద్దరేసి విద్యార్థులు కప్పుకున్న దృశ్యం

వంటశాల చెంతనే మరుగుదొడ్లు..


కిటికీ అద్దాలు పగిలిన దృశ్యం

రాజాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని ఎస్సీ పోస్టు మెట్రిక్ వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నట్టు రికార్డులు ఉన్నాయి. ఇక్కడ ఇన్‌చార్జి వార్డెన్ కొనసాగుతున్నారు. తెర్లాం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కుక్‌తో పాటు ఇద్దరు దిగువ స్థాయి సిబ్బంది ఉన్నారు. వంటశాల వద్దే అసౌకర్యంగా మరుగుదొడ్లు ఉన్నాయి. దుప్పట్లనే నేలపై పరుచుకొని విద్యార్థులు నిద్రిస్తున్నారు. కిటికీలు పాడయ్యాయి. దీంతో చలితో ఇబ్బందులు పడుతున్నారు. వార్డెన్ ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి.

తాగునీటికి ఇబ్బందులు..


పని చేయని మోటార్

రేగిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏవీపురం బాలుర వసతి గృహంలో 68 మంది విద్యార్థులు ఉన్నారు. తాగునీటి మోటారు పని చేయడం లేదు. పంచాయతీ కుళాయిలపై విద్యార్థులు ఆధారపడుతున్నారు. డ్రైనేజీ నిర్వహణ సరిగా లేదు. మురుగునీరు నిలిచిపోతుంది. విద్యార్థులకు ఐదేళ్లుగా ట్రంక్ పెట్టెలు సరఫరా కావడం లేదు. కొంత మందికే దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో ఇద్దరు ముగ్గురు ఒకే దుప్పట్లో పడుకుంటున్నారు. రెగ్యులర్ వార్డెన్ లేక గత నాలుగేళ్లుగా ఇన్‌చార్జిలతోనే హాస్టల్‌ను నెట్టుకొస్తున్నారు.

సమస్యల తిష్ఠ..


కిటికీ మెస్ ఊడిపోయిందని చెబుతున్న విద్యార్థులు

వంగర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఎస్ఆర్‌పురం బీసీ హాస్టల్‌లో 145 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు లేవు. విద్యార్థులు వరండాలో చదువుతున్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. కిటికీలకు అమర్చిన ఇనుప మెస్‌లు ఊడిపోవడంతో దోమలు వచ్చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


అద్దె ఇంట్లో నడుస్తున్న పిరిడి వసతి గృహం

ప్రైవేట్ భవనాల్లోనే..

బొబ్బిలి/రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి, కోమటిపల్లి, కలవరాయి బీసీ వసతి గృహాలను ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నారు. చాలీచాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, కిటికీలు, మంచాలు లేవు. మల, మూత్ర సందర్భాల్లో విద్యార్థులు ఆరుబయటకు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ● బొబ్బిలి పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహం, కేజీబీవీ, గిరిజన బాలికల వసతి గృహాల్లో సమస్యలు ఉన్నాయి. ఇక్క సరిపడ బాత్‌రూమ్‌లు లేవు. మంచాలు లేక నేలపైనే విద్యార్థులు నిద్రపోతున్నారు.

హాస్టల్‌లో సమస్యలు... విద్యార్థులు సతమతం


కిటికీకి తలుపు లేని దృశ్యం

రామభద్రపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ హాస్టల్‌లో 67 మంది వసతి పొందుతున్నారు. మంచాలు లేక కటిక నేలపైనే నిద్రిస్తున్నారు. సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించిన హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు వార్డెన్ వెంకటరావు తెలిపారు.

వసతులు కరువు..


వసతి గృహం కిటికీల మెస్‌లు ఊడిన దృశ్యం

శృంగవరపుకోట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు లేవు. ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు మిగిలిన అన్ని వసతి గృహాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. వాటికి అమర్చిన మెస్‌లు ఊడిపోయాయి. ఎస్టీ కళాశాల వసతి గృహంలో విద్యార్థులు నేలమీద పడుకుంటున్నారు. బీసీ కళాశాల బాలువ వసతి గృహం అద్దెభవనంలో నడుస్తుంది. సాంఘీక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహానికి తగినన్ని మరుగుదొడ్లు లేవు.

దోమల బెడద..

వీరఘట్టం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దోమల బెడద తప్పడం లేదు. కిటికీలకు ఉన్న మెస్‌లు పాడవ్వడంతో రాత్రి వేళల్లో వారు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు వారు రోజూ నేలపైనే పడుకోవల్సి వస్తోంది. ఒకవైపు చలి.. మరోవైపు దోమలతో విద్యార్థులు నిద్రకు దూరమవుతున్నారు.


భామిని: నేలపైనే పడుకున్న విద్యార్థులు

భవనాలు బాగున్నా.. వసతులేవీ?

భామిని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భామిని గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలు బయటకు మాత్రమే అందంగా కనిపిస్తున్నాయి. లోపల సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 256 మంది ఇక్కడ చదువుతుండగా వారికి వసతి సమస్య వేధిస్తోంది. ప్రస్తుతం విద్యార్థులు చలికి వణుకుతూ.. బోధన గదుల్లో నేలపై పడుకోవల్సి వస్తోంది.

చాలీచాలని దుప్పట్లు..


గురుకుల పాఠశాలలో కిటీకీలకు తలుపులు లేని దృశ్యం

సీతంపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏపీఆర్ గురుకుల బాలుర పాఠశాలలో 435 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 200 మంది శిథిలావస్థలో గురుకుల పాఠశాల పాత భవనంలో ఉంటున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనానికి సరైన తలుపులు, కిటికీలు లేవు. దీంతో గిరిజన విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. నేలపైనే దుప్పట్లు పరుచుకొని పడుకోవడంతో కప్పుకునేందుకు ఏమీ లేక రాత్రంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోవైపు దోమలు వారికి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. భవన నిర్మాణానికి నిధులు మంజూరైతేనే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయని పాఠశాల ప్రిన్సిపాల్ నీలంనాయుడు చెప్పారు.గిరిజన విద్యార్థులు చలికి ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఏటిడబ్ల్యూవో మంగవేణి తెలిపారు.

తరగతి గదుల్లోనే పడక..


పాఠాలు వింటున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పాచిపెంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట ఆశ్రమ పాఠశాలలో 261 మంది విద్యార్థులు ఉన్నారు. ఎలిమెంటరీకి సంబంధించి 3,4,5 తరగతులకు గాను 59 మంది ఉండగా వారికి ఒక్క టీచరు మాత్రమే ఉన్నారు. హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు ఎలిమెంటరీ పాఠశాలలో కూడా బోధించాల్సిన పరిస్థితి. ఆశ్రమ పాఠశాలలో పది గదులకు గాను మూడింటిని స్టాక్, స్టోర్, సిక్ రూములకు వినియోగిస్తున్నారు. మిగిలిన ఏడు గదుల్లో ఉదయం వేళ తరగతి గదులు నిర్వహిస్తుండగా రాత్రి వేళ అవే రూముల్లో నేలపైనే విద్యార్థులు పడుకోవాల్సి వస్తోంది.

వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ..


రావివలస ఎస్సీ బాలుర వసతి గృహం స్లాబుపై పెచ్చులు ఊడిన దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో రావివలస, గరుగుబిల్లి బీసీ బాలుర వసతి గృహాల్లో 122 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే వారికి బెడ్ షీట్లు అందాల్సి ఉంది. ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట గదులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రావివలస ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే గదుల్లోకి నీరు చేరుతుంది. స్లాబుపై పెచ్చులు ఊడిపోవడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ఇక్కడున్న 38 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

ఓ వైపు చలి.. మరోవైపు దోమలు


నేలపైనే నిద్రపోయిన విద్యార్థులు

పార్వతీపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొన్నేళ్ల కిందట నిర్మించిన అదనపు వసతి భవనంలో 35 మంది విద్యార్థులు తలదాచుకుంటున్నారు. కాగా కొన్ని గదుల్లో కిటీకీలకు మెస్‌లు ఊడిపోవడంతో విద్యార్థులు ఒకవైపు చలి.. మరోవైపు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం అవస్థలే..


పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో..

సాలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బంగారమ్మ పేటలో ఉన్న గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో 250 మంది విద్యార్థులు ఉంటున్నారు. అక్కడున్న ఏడు గదుల్లో నేలపైనే వారు పడుకోవల్సి వస్తోంది. దుప్పట్లు సరఫరా కాకపోవడంతో చలికి వణుకుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు హాస్టల్‌లో ఉన్న ఏడు మరుగుదొడ్లు వారికి చాలడం లేదు. డైనింగ్ హాల్, వంటగది నిర్మాణాలు పూర్తి కాలేదు. హాస్టల్ మేట్రిన్ రోజమ్మను వివరణ కోరగా.. 'సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో డైనింగ్‌హాల్, వంటగది నిర్మాణాలు పూర్తికాలేదు. కళాశాల స్థాయి విద్యార్థులకు గతంలో ఎప్పుడూ దుప్పట్లు పంపిణీ చేయలేదు.' అని తెలిపారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్


ఏఆర్, విజయనగరం సబ్ డివిజన్ జట్ల మధ్య కబడ్డీ ఫైనల్ పోటీ

విజయనగరం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. మూడు రోజు శుక్రవారం పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో పోలీసు శాఖలో పనిచేస్తున్న విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్, హోంగార్డు విభాగాలకు చెందిన పోలీస్ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలను ఏఆర్ ఏఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రీడా పోటీలు శనివారంతో ముగి యనున్నాయి. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, సీఐ లక్ష్మణరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తిలకిస్తున్న జనం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అదానీతో ఒప్పందాలు రద్దు చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయనగరం దాసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. కోట్ల రూపాయల అదానీ కుంభకోణం జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నా తనకేమీ తెలియదన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. దీనిపై సమాచారం సేకరిస్తున్నామని బుకాయిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి మూలాలన్నీ రాష్ట్రం వైపు వేలెత్తి చూపిస్తున్న ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణం. చంద్రబాబు వద్ద ఆధారాలు లేకపోతే మేము అందిస్తాం. తొందరలోనే ఆయన్ను కలుస్తాం'. అని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నేతలు కామేశ్వరరావు, ఒమ్మి రమణ, బుగత అశోక్, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్సలాన్‌ఖాన్ అజేయ సెంచరీ

● ఛండీగఢ్ సునాయాస విజయం ● ఛత్తీస్‌గఢ్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు


ఛండీగఢ్, ఛత్తీస్‌గఢ్ మధ్య జరుగుతున్న మ్యాచ్

విజయనగరం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న సయ్యద్ ముస్తక్ అలీ టీ-20 దేశవాళీ క్రికెట్ టోర్నీలో ఛండీగఢ్ జట్టు విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ జట్టుపై 9 వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఛండీగఢ్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఛత్తీస్‌గఢ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 176 సాధించింది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్, కెప్టెన్ అమన్‌దీప్ ఖారే 39 బంతుల్లో 62 పరుగులు చేయగా, మిడిలార్డర్‌లో సంజీవ్ దేశాయ్ (20), పీఎం యాదవ్ (18), శశాంక్‌సింగ్ (33), అజయ్‌మండల్ (22) పరుగులతో రాణించారు. ఛండీగఢ్ జట్టు బౌలర్లలో జగ్జీత్‌సింగ్ సంధు 5 వికెట్లు సాధించాడు. అనంతరం 177 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఛండీగఢ్ జట్టు 16.4 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయలక్ష్యాన్ని అందుకుంది. ఓపెనింగ్ బ్యాటర్ అర్సలాన్ ఖాన్ అజేయ సెంచరీ (57 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్సులతో 107 పరుగులు)తో కదం తొక్కాడు. అతనికి వన్‌డౌన్ బ్యాటర్ శివం బాంబ్రి (36 బంతుల్లో 62 పరుగులు) అర్థ సెంచరీతో సహకారం అందించడంతో ఛండీగఢ్ విజయం లాంఛనమే అయ్యింది. ఈ విజయంతో ఛండీగఢ్ జట్టు ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.

న్యూస్ బాక్స్

మహిళలు బలోపేతం కావాలి

నెల్లిమర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు, నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు అన్నారు. నెల్లిమర్ల మెప్మా ఆధ్వర్యంలో స్థానిక రామతీర్థం జంక్షన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా వ్యాపారులతో మాట్లాడారు. ప్రతి మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రయత్నించాలని సూచించారు. సీఎంఎం గోవిందరావు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు

జాబ్ మేళాకు 90 మంది హాజరు

చీపురుపల్లి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు 90 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ డా. పీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 36 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థకు 8 మంది, అరబిందో ఫార్మాకు 13, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సుకు 15 మంది ఎంపికయ్యారన్నారు. చీపురుపల్లి డిగ్రీ కళాశాలకు చెందిన 16 మందికి ఉద్యోగాలు దక్కినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో జేకేసా సమన్వయ కర్త కె. ఉషాజ్యోతి, మెంటార్ అమర్‌లింగం, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు నగర మేయర్ విజయలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలన అందించడమే అందరి ధ్యేయమన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ తిరమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణస్వామి, రూపదేవి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): సీనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 1 వరకు అమరావతిలోని మంద డంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లా నుంచి వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, సెపక్‌తక్రా కార్యదర్శి రాజేష్, టీడీపీ నేత సురేంద్రయాదవ్, తదితరులు అభినందిస్తూ పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు.

తూర్పు కాపుల సంక్షేమానికి కృషి

విజయనగరం దాసన్నపేట, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న తూర్పు కాపుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తూర్పుకాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు అంబళ్ల అప్పలనాయుడు తెలిపారు. నగరంలోని వేదిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తూర్పు కాపులు ఐక్యతతో ముందుకు వెళ్తే అభివృద్ధి సాధ్యమన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో తూర్పు కాపుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. వచ్చే నెల 1న వేదిక ఆధ్వర్యంలో రామవరం పప్పుల మిల్లు సమీపంలో ఉన్న శ్రీనివాస లేఅవుట్‌లో తూర్పు కాపుల ఆత్మీయ సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి జిల్లాలోని తూర్పు కాపు సోదరులు కుటుంబసభ్యులతో హాజరు కావాలన్నారు.

బీసీ సంక్షేమ శాఖ అధికారిణిగా అనిత

విజయనగరం, కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణిగా ఎస్‌డీ అనితను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈమె జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అనితను బీసీ సంక్షేమ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సాగు నీటి వనరుల పరిరక్షణే ధ్యేయం

చీపురుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని సాగు నీటి వనరుల పరిరక్షణే తమ ప్రధాన ధ్యేయమని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జారారపు ఈశ్వరప్రసాద్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పరిరక్షణ యాత్ర శుక్రవారం చీపురుపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆలయం వద్ద ఉన్న పెద్ద గెడ్డ వద్ద విలేకరులతో మాట్లాడారు. నీటి వనరులు విధ్వంసం కారణంగా రానున్న రోజుల్లో తలెత్తబోయే పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, ఆ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

అందరినీ సంఘాల్లో చేర్పించాలి

రాజాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) స్వయం శక్తి సంఘాల్లో లేని సభ్యులను సంఘాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు ఆదేశించారు. శుక్రవారం రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఏ చిరంజీవి, వెలుగు, డీఆర్‌డీఏలతో సమావేశం నిర్వహించారు. వీవోఏఎస్ ద్వారా పూర్తిస్థాయిలో సంఘాలలో చేరినట్లు కృషి చేయాలన్నారు. సంఘాల్లోని సభ్యులకు అందించే రుణాలు దుర్వినియోగం కాకుండా అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కూటమి పాలనలో గ్రామాలకు మహర్దశ

▸▸ రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనలో కోండ్రు

రాజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో గ్రామీణ ప్రాంతాల రహదారులకు మోక్షం కలుగుతుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలం బొద్దాం-కొరారిపురం రహదారికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం రూ.80 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఈ రోడ్డు పనులు త్వరగా ప్రారంభిస్తారన్నారు. వైసీపీ పాలనలో ఈ రహదారి పూర్తిగా పాడైనప్పటికీ కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడంతో సుమారు 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. గారాజు చీపురుపల్లి వద్ద నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించి కోకోనట్ మిషన్, ప్లాస్టిక్ బాయిలింగ్ మిషన్‌ను ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రాజాం- బలిజిపేట నూతన పల్లెవెలుగు బస్సును ప్రారంభించి స్వయంగా ఆయన బస్సును నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజాం నియోజకవర్గంలో రూ.60 కోట్ల తో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అలాగే ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన జీవనాన్ని కల్పించేందుకు స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించామన్నారు. సీఎం చంద్రబాబు విజయనగరం నుంచి పాలకొండ వీపీ ప్రోజెక్టులో భాగంగా నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేశారన్నారు. చిలకపాలెం నుంచి రామభద్రపురం నాలుగు లైన్లు వస్తే రాజాం రింగ్‌రోడ్డు పూర్తవుతుందన్నారు.


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కోండ్రు మురళీమోహన్

● రాజాం పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల లేనందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి కళాశాల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. దీనికి స్థలం కేటాయించి వచ్చే ఏడాది పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్ కృష్ణంరాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

▸▸ ఎస్పీ వకుల్ జిందల్


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. విజయనగరం పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ఒక్కొక్కరిని చాంబర్‌లోకి పిలిచి వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సమస్యలను నమోదు చేసుకున్నామని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడిలో జేసీ పర్యటన


వీపీ రేగలో రైస్‌మిల్లును పరిశీలిస్తున్న జేసీ

గరివిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరివిడిలో శుక్రవారం జేసీ సేతుమాధవన్ పర్యటించారు. మండలంలో వీపీ.రేగ, కాపు సంబాం గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లుల పనితీరును పరిశీలించారు. రైతులు పండించిన వరిపంటను నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు కొత్త కళ


ఎల్‌టీఐ మైండ్ ట్రీ సౌజన్యంతో ఒప్పందం కుదుర్చుకున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం

పర్లాకిమిడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు కొత్త కళ తీసు కొచ్చేందుకు సెక్టార్ హేబిటేషన్ పేరుతో హౌసింగ్ ప్రాజెక్టు రూపొందించినట్లు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీఎన్ రావు తెలిపారు. ఈ మేరకు ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. గజపతి జిల్లాలో తుపాన్ ప్రభావిత ప్రాంతాలైన గయలజుల, అలజోలా రషికరాజ్‌పూర్ గ్రామాల్లో దాదాపు 3 వేల మందికి ఇళ్ల ద్వారా ప్రయోజనం అందుతుందన్నారు. ఆయా గ్రామాల్లో మొదటి విడతగా 80 ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎల్‌టీఐ మైండ్ ట్రీ చీఫ్‌సెసబిలిటీ ఆఫీసర్ ఫణీస్ రౌత్ర మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు కమ్యూనిటీలకు సాధికారిత కల్పించడంలో నిబద్ధతను ప్రతిబింబిస్తుందని, గిరిజనుల్లో నైపుణ్యం పెంపొందించి ప్రభుత్వ మద్దతుతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనితాపాత్రో, సుప్రియపట్నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులతో ప్రేమగా మెలగాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

రాజాం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభవంతులైన పిల్లలు, శారీరక, మానసిక దివ్యాంగుల పట్ల ప్రేమతో మెలగాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ యుగంధర్ స్పష్టం చేశారు. మండల న్యాయసేవా సంఘం-పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో న్యాయాధికారి పాల్గొన్నారు. ఇలాంటి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గుర్తించి వైద్య సేవలందించాల్సి ఉందని గుర్తు ఆయన చేశారు. చిన్నారులకు చెవి, ముక్కు, గొంతు పరీక్షలతో పాటు రక్తపరీక్షలు, స్క్రీనింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ తరహా చిన్నారులు ఇతర చిన్నారుల మాదిరిగా జీవనం సాగించేందుకు సహకారం అందివ్వాలని కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ పేర్కొన్నారు. డా.కిరణ్‌కుమార్, డా.అనూష, డా.కె.అనూష, డా.నేతాజీ, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమాన అవకాశాలతోనే మెరుగైన భవిష్యత్తు

గజపతినగరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కలిగినప్పుడే మెరుగైన భవిష్యత్ లభిస్తుందని వెలుగు సీసీ కె.నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని దావాలపేట గ్రామంలో గ్రామైక్య సంఘ అధ్యక్షుడు, మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ చేట్టారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యనారాయణ, వీవోఏ అధ్యక్ష కార్యదర్శులు త్రినాథ, పొందూరు సంతోషి, గ్రామ పెద్దలు వరదా తిరుపతిరావు, మాదాను అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణలింగేశ్వరునికి అన్నాభిషేకం



విజయనగరం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తోటపాలెంలో ఉన్న శ్రీ వాణీ సమేత పూర్ణ లింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు అన్నంతో అభిషేకం నిర్వహించారు. అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణేశ్వరికి ప్రీతిపాత్రమైన అన్నదానంలో భాగంగా ఏటా కార్తీకమాసంతో వచ్చే మాసశివరాత్రి రోజున నిర్వాహకులు, భక్తులు పూర్ణ లింగేశ్వర స్వామికి అన్నంతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శివపార్వతులకు కల్యాణం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కాల్పుల ఘటనలో వ్యక్తి అరెస్టు

సీతంపేట రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గి గ్రామంలో గత రెండు రోజుల కిందట బిడ్డిక లక్ష్మాయి అనే గిరిజనుడిపై కాల్పులు జరిపిన ఘటనలో అదే గ్రామానికి చెందిన కొండగొర్రి రాజేష్ అనే ముద్దాయిని అరెస్టు చేసినట్లు దోనుబాయి ఎస్ఐ మస్తాన్ శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను ఎస్ఐ వెల్లడించారు. దుగ్గి గ్రామానికి చెందిన కె.రాజేష్ తానే నేరం చేసినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. దీంతో అతనిని అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

విజయనగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుపాను వల్ల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తామని కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 25వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఈ రెండురోజుల్లో ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. రైతు ధాన్యం జీపీఎస్ వాహనాల ద్వారా తరలించాలనే నిబంధనలు ఉన్నా, తుపాన వల్ల వాటిని సడలించామని, ఏ ఒక్క రైతూ ధాన్యం తడవకుండా సేకరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. దీనిపై రైతులు ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని, ప్రతి ధాన్యం గింజా కొంటామని ప్రకటనలో తెలిపారు.

పశువైద్యశాల సేవలను వినియోగించుకోండి

▸▸ జిల్లా పశుసంవర్థక శాఖ సంచాలకుడు రమణ

కొత్తవలస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పశువులకు సంక్రమించే వ్యాధుల నివారణ కోసం పశు వైద్యశాలల సేవలను పాడిరైతులు వినియోగించుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ సంచాలకుడు వై.వి.రమణ సూచించారు. శుక్రవారం కొత్తవలసలోని పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణన కార్యక్రమాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులను పెంపకం చేస్తున్న పాడి రైతులు తమ పశువులకు సంక్రమించే వివిధ రకాల వ్యాధుల నివారణకు అవసరమైన వ్యాక్సిన్‌లు వేయించుకుని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా గనిశెట్టిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శించారు. 47 పాడిపశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలు, 12 పశువులకు సాధారణ చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రైతులు లేగ దూడలు ప్రదర్శన చేయగా వీటిలో మంచి ఆరోగ్యంగా ఉన్న లేగదూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులను అందచేశారు. కొత్తవలస ఏడీ గంగాధరరావు, లక్కవరపుకోట, దెందేరు పశువైద్యశాలల వైద్యులు గాయత్రి, ప్రదీప్, గనిశెట్టిపాలెం సర్పంచ్, ఉపసర్పంచ్ జామి ఈశ్వరరావు, జామి కొండలరావు, తెలుగుదేశం పార్టీనాయకుడు జామి సూర్యనారాయణ పాల్గొన్నారు.


ఆరోగ్యంగా ఉన్న దూడలను ఎంపిక చేసి బహుమతి అందిస్తున్న జిల్లా అధికారులు

ప్రమాదాలకు నిలయంగా సారిపల్లి పారిశ్రామిక వాడ రోడ్డు

నెల్లిమర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సారిపల్లి ఇండస్ట్రియల్ ఏరియా రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డులో మలుపులతో పాటు పరిశ్రమల కారణంగా ఇటీవల వాహనాల రాకపోకలు, ప్రజల రాకపోకలు పెరగడంతో ప్రమాదాల సంఖ్య పెరిగింది. ప్రమాదాల నియంత్రణకు పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. విజయనగరం - పాలకొండ రోడ్డు నుంచి సుమారు 5కిలోమీటర్ల దూరం వరకు పరిశ్రమలతో పాటు వైఎస్ఆర్ నగర్ కాలనీ, జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం ఉన్నాయి. చంపావతి నదిని దాటుకుని సారిపల్లి గ్రామానికి చేరుకునే ప్రజలు సైతం ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తారు. వైఎస్ఆర్ నగర్ కాలనీ ఇటీవల ప్రారంభం కావడంతో జనం రాకపోకలు కూడా పెరిగాయి. విజయనగరం-పాలకొండ రోడ్డు నుంచి సారిపల్లి ఐడీఏ రోడ్డులోనికి ప్రవేశించిన వెంటనే ఎక్కడికక్కడ మలుపులు ఉన్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు వాహనాల రాకపోకల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ ప్రాంతంలో సారిపల్లి ఐడీఏ పరిధిలోని సుమారు 60 పరిశ్రమలతో పాటు పోలీస్ శిక్షణ కేంద్రం, వైఎస్ఆర్ కాలనీ, ఓ ఆయుర్వేద ఆసుపత్రి, వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన దిబ్బేశ్వర ఆలయం ఉన్నాయి. చంపావతి నదికి వెళ్లే పర్యాటకులు సైతం ఈ రోడ్డు మార్గానే రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డులో అవసరమైన చోట్ల పోలీసులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ఇటీవల కాలంలో జనం రాకపోకలు, వాహనాల రాకపోకలు పెరిగినప్పటికీ రోడ్డును వెడల్పు చేసేందుకు అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. ఎప్పుడో 1980-90 మధ్య కాలంలో సారిపల్లి పారిశ్రామిక వాడ కోసం వేసిన చిన్న పాటి రోడ్డునే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. కొన్ని సార్లు ఎదురెదురు వాహనాలు తప్పుకునేందుకు కూడా ఇక్కట్లు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి జనం రాకపోకలను, వాహనాల రాకపోకలను ప్రాతిపదికగా తీసుకుని రోడ్డు వెడల్పు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాల్సిందిగా స్థానికులు, పరిశ్రమలకు వచ్చే కార్మికులు కోరుతున్నారు.


సారిపల్లి పారిశ్రామిక వాడ జంక్షన్ ఇదే

ఆటోను ఢీకొన్న వ్యాను.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బొబ్బిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రోత్ సెంటరు గున్నతోటవలస జంక్షన్ దగ్గర శుక్రవారం సాయంత్రం ఆటోను వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఏఎస్ఐ జి.భాస్కరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు బంగారమ్మపేటకు చెందిన ఆటో పార్వతీపురం మన్యం జిల్లా పెదబోగిలి నుంచి తిరిగి సాలురు వెళ్తుండగా బొబ్బిలి పట్టణంలోని గున్నతోటవలస రోడ్డు జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నల్ల రాజశేఖర్, ఆటోలో ఉన్న అనిత అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రాజశేఖర్, అనితను స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కరరావు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ డీటీ దంపతులకు గాయాలు

బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిలటరీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ గుణుపూరు సూర్యనారాయణ, గౌరి దంపతులు శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. బాడంగి మండలం గజరాయునివలస వీరి స్వగ్రామం. అక్కడికి వెళ్లి శుక్రవారం తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రామభద్రపురం గ్లోబల్ స్కూలు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, రామభద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

6 రోజులు శ్రమదానం చేయండి

● పేకాట నిందితులకు శిక్ష విధించిన కోర్టు

డెంకాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): డి.తాళ్ళవలస గ్రామ శివారులో ఈ నెల 26న పట్టుకున్న 13 మంది పేకాట రాయుళ్లకు 6 రోజులపాటు శ్రమదానం చేశాయలని ఆదేశిస్తూ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.శ్రీనివాసరావు శిక్ష విధించారని ఎస్ఐ సన్యాసినాయుడు శుక్రవారం తెలిపారు. ఈ 6 రోజుల్లో 5 రోజులు జిల్లా కోర్టు, పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేయించాలని, 1 రోజు డెంకాడ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేయించాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ శ్రమదానాన్ని డెంకాడ పోలీసులు అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ పేకాటరైడ్‌లో 13 మంది జూదరులతో పాటు రూ.46580 నగదు, ఒక కారు, 5 మోటారు సైకిళ్లు 15 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

కొత్తవలస, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో నివాసం ఉంటున్న అచ్చయ్యశెట్టి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగను అరెస్టుచేసి శుక్రవారం కొత్తవలస కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. 2023 డిసెంబర్ నెలలో గేట్ సమీపంలో నివాసం ఉంటున్న అచ్చయ్యశెట్టి ఇంటిలో చోరీ జరిగింది. ఈ చోరీలో రెండుతులాల బంగారు ఆభరణాలు పోయినట్టు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ చోరీకి సంబంధించి తాడి తరుణ్ కుమార్ అనే నిందితుడిని పట్టుకుని చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి ఆభరణాలను రికవరీ చేయడంలో ఎస్ఐ సుదర్శన్ కృషి చేసినట్టు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

కురుపాం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జి.శివడ గ్రామానికి చెందిన దేవరాపు త్రినాథం(54) గురువారం రాత్రి తన పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా దారిలో పాము కాటేసింది. వెంటనే బంధువులు, గ్రామస్థులు త్రినాథంను భద్రగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే త్రినాథం మరణించినట్టు వైద్యులు తెలిపారు. నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

భోగాపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలం లింగాలవలస పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న గూడెపువలసకు చెందిన పారిశుధ్య కార్మికుడు బోనెలరాము(55) గుండుపోటుతో శుక్రవారం మృతి చెందాడు. బోనెల రాము, మృతుడి భార్య రామయ్యమ్మ ఇద్దరూ గత కొంతకాలంగా లింగాలవలస పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్స్‌గా పనిచేస్తున్నారు. అయితే ఎప్పటి మాదిరిగానే శుక్రవారం పారిశుధ్య పనుల్లో భాగంగా మురుగు కాలువలో పూడిక తీస్తుండగా ఒక్కసారిగా కూలబడిపోయాడు. అక్కడే ఉన్న సహచరులు అతన్ని భోగాపురం సమీప సుందరపేట ఆసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడు భార్య కన్నీరు మున్నీరై రోదిస్తుంది. భార్యభర్తలు గ్రీన్ అంబాసిడర్స్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

పూసపాటిరేగ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలో పేరాపురం జంక్షన్‌వద్ద అక్రమంగా మద్యం దుకాణం నిర్వహిస్తున్న ఓనము అశిరమ్మ వద్ద శుక్రవారం స్థానిక పోలీసులు 20మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలిపై ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదుచేశారు. అక్రమంగా మద్యం దుకాణాలు నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పల్లెపండగ పనుల అడ్డగింత


రోడ్డు నిర్మాణ పనులకు తీసుకొచ్చిన జేసీబీని అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు

భోగాపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో టీడీపీకి కనీసం సమాచారం ఇవ్వకుండా ఏవిధంగా పనులు నిర్వహిస్తారంటూ టీడీపీ నాయకులు, కార్య కర్తలు శ్మశానవాటిక సీసీ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. శుక్రవారం మండలం చెరుకుపల్లి గ్రామంలో పల్లె పండగలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశానవాటికకు సీసీ రహదారి నిర్మాణ పనులు జనసేన కార్యకర్తలు ప్రారంభించారు. అయితే విషయం తెలుసుకున్న టీడీపీ మండల పార్టీ తెలుగు యువత అధ్యక్షులు తోగులరెడ్డి, టీ.గురుమూర్తి, రిక్కా ఆదినారాయణ, బైరెడ్డి శ్రీను, తదిత రులు జేసీబీని పనులు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. కనీసం పంచాయతీలో 5 శాతం కూడా లేని జనసేన కార్యకర్తలకు ఏవిధంగా అభివృద్ధి పనులు అప్పగిస్తార ని మండిపడ్డారు. అనంతరం పనులు నిర్వహించడానికి అవకాశం లేకపోవడంతో జేసీబీని అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయారు.

పూసపాటిరేగ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పొత్తుధర్మాన్ని పాటించకుండా జనసేన కార్యకర్తలకు మాత్రమే పనులు కేటాయించారంటూ శుక్రవారం మండలంలో కోనాడ గ్రామానికి చెందిన కార్యకర్తలు పనులను అడ్డుకొన్నారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి గ్రామాల్లో పనులు జనసేనవారికే కేటాయించటంతోపాటు స్థానిక తెలుగుదేశంపార్టీ నాయకులకు తెలియజేయలేదంటూ పనులను అడ్డుకొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈపనుల నిర్వాహణకు వాహనాన్ని తేవటంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు ఈపనులను అడ్డుకున్నారు. తమపార్టీ వారికి కూడా పనులు కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో పనులను ఆపివేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే విజయచంద్ర



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చెప్పారు. నర్సిపురం పంచాయతీ పరిధిలో ఉన్న తన స్వగృహంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజలు అనేక మంది వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలను సమర్పించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎస్పీ మాధవరెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసుల సమస్యలు పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యపరమైన, వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ వసతి గృహం పరిశీలన

కురుపాం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో గల బీసీ వసతి గృహాన్ని నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరరావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా హాస్టల్‌లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి, శుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో కుక్ మాత్రమే ఉండటంతో వార్డెన్ ఎక్కడ.. అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఎన్ఎంకు విద్యార్థులకు ఎప్పుడు వైద్య పరీక్షలు చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, ఈవోపీఆర్డీ రమేష్‌బాబు, ఏపీవో పి.బావాజీ, కార్యదర్శి ధనుజయరావు తదితరులు పాల్గొన్నరు.

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దయానిధిపురం, గాదెలవలస గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటి సర్వేను మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ శుక్రవారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను, పాఠశాలలను సందర్శించారు. డిసెంబరు 7న జరగబోయే పేరెంట్స్ డేను ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే జోగింపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయనతో పాటు ఎంపీడీవో త్రివిక్రమరావు, సచివాలయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తవలస గ్రామానికి సంబంధించిన జగనన్న కాలనీలో జీ లే అవుట్‌లో బడి, గుడికి కేటాయించిన స్థలాల ఆక్రమణలను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ జీ లేఅవుట్‌లో 61 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి, పక్కా భవనాల నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పి.సన్యాసిరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచాలి

● డీఈవో తిరుపతినాయుడు

మక్కువ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేలా చర్యలు చేపట్టాలని డీఈవో ఎన్.తిరుపతి నాయుడు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపార్ నమోదు వేగవంతం కావాలన్నారు. వచ్చే నెల 7న జరగనున్న మెగా పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరం తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్యాంసుందరరావు, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సాలూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ వైసత్యంనాయుడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన శుక్రవారం మామిడి పల్లిలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ బోధన చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాన్ని పరిశీలించారు.

ఆంగ్లంలోనే బోధించాలి

కొమరాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కచ్చితంగా ఆంగ్లంలోనే బోధన నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎ.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేజీబీవీని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికతో పాటు వసతి గృహం, భోజనశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, మెనూ అమలు, ఉపాధ్యాయుల బోధన తీరుపై అడిగి తెలుసుకున్నారు. బోధన ఆంగ్లంలోనే సాగాలని ఆయన ఉపాధ్యా యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జడ్పీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఎంఈవో తిరుపతిరావు ఉన్నారు.

విద్యార్థులకు దోమ తెరల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్లె నిద్రలో భాగంగా మండలంలోని రాయగడ జమ్మి గ్రామం దగ్గరలో ఉన్న గొరడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలను జిల్లా మత్స్య శాఖాధికారి వేముల తిరుపతయ్య శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి 20 దోమ తెరలను తెప్పించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, సర్పంచ్ పి.అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేగిడిలో పల్లెనిద్ర

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేగిడి పీహెచ్‌సీ వైద్యులు, ప్రత్యేకాధికారి స్వాతి శుక్రవారం రేగిడి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతిపై ఆరా తీశారు. వంటకాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని, పాఠశాల పరిశుభ్రతకు కృషి చేయాలని హెచ్‌ఎంలు, వార్డెన్‌కు సూచించారు.

బస్సు సౌకర్యం కలేనా?

● తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భోగాపురం మండల వాసులు

● ఎయిర్‌పోర్టు ఏర్పాటు సరే.. కనీస అవసరాలేవీ.. అంటూ సర్వత్రా విమర్శలు

● రాకపోకలకు ఆటోలే దిక్కు

భోగాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. త్వరలో విమానాలు ఎగరబోతున్నాయి. కానీ మండల వాసులు ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ సౌకర్యం మాత్రం కలగానే మిగిలిపోయింది. భోగాపురంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల వాసులకు ఆటోలే దిక్కవుతున్నాయి. మండలంలో 22 పంచాయతీలు ఉండగా జాతీయ రహదారి ఆనుకుని ఉన్న కేవలం మూడు, నాలుగు పంచాయతీలకు మాత్రమే ఆర్టీసీ పాసింజర్ సౌకర్యం ఉంది. ఇతర గ్రామాలకు ఆర్టీసీ సేవలు లేవు. దీంతో మండల వాసులు, కళాశాలల విద్యార్థులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో భోగాపురంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఉండేది. బస్సులు నిరంతరం రాకపోకలు సాగించేవి. ఇప్పటికైనా మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని భోగాపురం వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



భోగాపురం మండల కేంద్రంలో రాకపోకలకు ఈ ఆటోలే దిక్కు

సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయండి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నుంచి సక్రమంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం పంచాయతీ పూతికవలస గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతర మిల్లర్లకు పంపిస్తున్న ధాన్యం లారీని జెండా ఊపి ప్రారంభిం చారు. రైతులు వద్ద సక్రమంగా తూనికలు చేపట్టి కొనుగొలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు కోలా రంజిత్ కుమార్, బలగ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

రైతులు ప్రభుత్వ సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు సద్వి నియోగం చేసుకుని అధిక దిగుబడి సాంధించాలని విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. శుక్రవారం కురుపాంలో ఆమె రైతులకు సబ్సిడీపై మినుములు, పెసలు విత్తనాలు, టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఏడీఏ నిర్మల జ్యోతి, ఏవో పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపకరణాలకు ఎంపిక

ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం హైదరాబాద్ అలిమ్ కోసంస్థ, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సహకారంతో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజక వర్గంలో గల విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఉపకరణాల గుర్తింపు కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరి పాల్గొని, మాట్లాడారు. ఎంపికైన వారికి రెండు నెలల్లో పరికరాలు పంపిణీ చేస్తారని చెప్పారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత మాట్లాడుతూ నియోజక వర్గం లోని ఐదు మండలాలో గల 161 మంది దివ్యంగులుకు పలు రకాల ఉపకరణాలను పొందటానికి అర్హులుగా గుర్తిం చామని చెప్పారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీ ల్దార్ రమణమ్మ, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగొలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎంజేపీ పాఠశాల పరిశీలన

కురుపాంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్సియల్ స్కూల్‌ను ఎమ్మెల్యే జగదీశ్వరి శుక్రవారం పరిశీలించా రు. పాఠశాల గదులు, పరిసరాలు పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఎండీఎం మెనూపై ఆరా తీశారు. పాఠశాల పనితీరు మారాలని ఆమె హెచ్చరించారు.

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము

పార్వతీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లోకి నగదును జమవుతోంది. ఇప్పటివరకు రూ.23 కోట్ల 29లక్షలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు ప్రభుత్వం రూ.19కోట్ల 86లక్షలు చెల్లించింది. ఇప్పటివరకు జిల్లాలో 65 రైస్‌మిల్లుల ద్వారా రూ.43కోట్లు 39లక్షల బ్యాంకు గ్యారెంటీలు అధికారులకు అందాయి. గతంలో మిల్లర్లకు జమ చేయాల్సిన రూ.4కోట్ల 90లక్షల బ్యాంకు గ్యారెంటీల్లో జమ చేశారు. ఈనెల 29 వరకు 11వేల 445 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఒక్క 28న సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నులు కునుగోలు చేశారు. జిల్లాలో 301 ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నాం. కొనుగోలు చేసిన ధాన్యం వర్షానికి తడవకుండా ఉండే విధంగా నిల్వ చేశాం.

- శ్రీనివాసరావు, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్

దిగుబడుల నిర్ధారణకు పంట కోత ప్రయోగాలు

గరుగుబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి పంట దిగుబడులను నిర్ధారించేందుకు పంట కోత ప్రయోగాలు చేపడుతున్నామని జిల్లా రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. శుక్రవారం సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస గ్రామంలో వరుసగా ఐదేళ్ల నవధాన్యాలు వేసిన రైతు ఎం.రేగునాయుడు పొలంలో, అలాగే ఒక సంవత్సరం నవధాన్యాలు వేసిన రైతు ఎం.కృష్ణమూర్తి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. రేగునాయుడు వరి క్షేత్రంలో 5 ఇంటూ 5 పంట కోత ప్రయోగంలో 15.32 కేజీలు వచ్చాయని, అలాగే కృష్ణమూర్తి వరి క్షేత్రంలో చేపట్టిన పంట కోత ప్రయోగంలో 13.2 కేజీలు దిగుబడి వచ్చింది తెలిపారు. జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు, ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ గొల్లు అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ ఎం.స్వామినాయుడు, సిబ్బంది దత్తి వెంకటనాయుడు, జానకి, రైతులు పోలినాయుడు, గుంపస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

సాలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తూనికల్లో తేడాలు ఉండటంతో పట్టణంలోని రెండు షాపులపై కేసులు నమోదు చేసినట్టు తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ రత్నరాజు తెలిపారు. పెద్దబజార్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న చేపల షాపులో ఆయన శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తూనికల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ షాపులపై కేసులు నమోదు చేశారు. ఆయన వెంట టెక్నీసియన్ నరిసింహ ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

పార్వతీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హెల్త్, వెల్నెస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతా ప్రమాణాల అమలుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, పీఎల్ రఘుకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని, పలు సూచనలు చేశారు. క్వాలిటీ కన్సల్టెంట్ కె.శ్రీనివాస్.. వైద్యాధికారులు, సీహెచ్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందినవారు వారి పరిధిలో వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ శిక్షణలో వైద్యాధికారులు కమలనాథ్, కౌశిక్, శ్రీకాంత్, నిహారిక, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించండి

పాలకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. నగర పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కొన్నేళ్లుగా నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్య నెలకొందని, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు ఆయన సూచించారు. కమిషనర్ స్పందిస్తూ రెవెన్యూ యంత్రాంగం చొరవతో స్థలాన్ని సేకరించి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇటీవల నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి చైర్‌పర్సన్ హోదాకు రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమె రాజీనామాకు ఆమోదించారు. తదుపరి నగర పంచాయతీ చైర్మన్‌గా కౌన్సిలర్ రౌతు హనుమంతురావును ఎన్నుకోవాలని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఏజెండాలో లేని అంశమని, తదుపరి చర్చించాలని కిల్లారి మోహన్‌రావు, పల్లా ప్రతాప్ అన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ నిబంధనలు మేరకు కౌన్సిల్ సభ్యుల తీర్మానంతో ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామని, నిబంధనలు మేరకే తాత్కాలిక చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ చేపడతామని తెలిపారు.

శంకుస్థాపన చేసిన చోటే విశ్వవిద్యాలయం నిర్మించాలి

సాలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శంకుస్థాపన చేసిన చోటే గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విశ్వ విద్యాలయం ప్రస్తుతం నిర్మాణం కొనసాగుతున్న మెంటాడ మండలం కుంటినవలస వద్దనే కొనసాగించి జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మెంటాడ మండలంలో సుమారు 560 ఎకరాల స్థలాన్ని పరిశీలించి శంకుస్థాపన చేసిన తర్వత మళ్లీ గిరిజన విశ్వవిద్యాలయాన్ని తరలించాలనే ఆలోచన ఈ ప్రభుత్వం చేయటం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



బెలగాం: నిరసన శిబిరం వద్ద మాట్లాడుతున్న మురళి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను డెప్యుటేషన్ వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పది రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యలు పరిష్కారం చేయకుండా వారిని మరింత ఆందోళన గురిచేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలి

బెలగాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ కోరారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల రిలే దీక్ష పదో రోజు శుక్రవారం కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్థానంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై వేసి పాఠశాలను నడిపించాలని అధికారులు ఉత్తర్వులు ఇవ్వడాన్ని యూటీఎఫ్ ఖండిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, దివాకర్, రాజేష్, వెంకట్, అరసాడ రమేష్, రాయల వెంకట్, గిరిజన సంఘం నాయకులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

● డీపీవో కొండలరావు

జియ్యమ్మవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాల్సిన బాధ్యత హెచ్ఎంలదేనని మండల ప్రత్యేకాధికారి, డీపీవో టి.కొండలరావు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని హైస్కూల్, టీడబ్ల్యూ ఆశ్రమ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో ఎస్.రమేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి అక్కడ ఇబ్బందులు హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎండీఎం వంటలను పరిశీలించారు. అనంతరం టీడబ్ల్యూహెచ్ స్కూల్‌ను సందర్శించి, అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కిచెన్ గార్డెన్లను పరిశీలించి విద్యార్థులకు వీటివల్ల కొంత శ్రద్ధను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరువాత అంగన్‌వాడీ కేంద్రాలను, గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఈయన వెంట ఎంఈవో-2 శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర ఉన్నారు.

సారా స్వాధీనం

సాలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరేళ్లవలస నుంచి సారాతో వస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సాలూరు రూరల్ హెచ్‌సీ బంగారురాజు శుక్రవారం చెప్పారు. రెండు స్కూటీలపై కొర్ర పండు, సంగిరెడ్డి గాసి 11 లీటర్ల సారాను తరలిస్తున్నారన్నారు. వారిని దండిగాం జంక్షన్ వద్ద సోదా చేయగా సారాను గుర్తించామని చెప్పారు. సారాతో వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. ● కొమరాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్తాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు యు.నాగేశ్వరరావు, ఎస్.రేవతమ్మ తెలిపారు. ఈ దాడుల్లో గుమడ గ్రామానికి చెందిన వెలగాడ సింహాద్రి అనే వ్యక్తి వద్ద 400 సారా ప్యాకెట్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు చెప్పారు. ఈ దాడుల్లో పార్వతీపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

● పార్వతీపురంటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన సారా ప్యాకెట్లతో పాటు రవాణాకు సిద్ధంగా ఉంచిన బైకును స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సురేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొమరాడ మండలం అర్తాం, గుమడ గ్రామాల్లో శుక్రవారం దాడులు నిర్వహించి, 400 సారా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సారా రవాణా చేస్తున్న గుమడ గ్రామానికి వి.సింహాద్రిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నాగేశ్వరరావు, రేవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు మహిళల అరెస్టు

సాలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సారా ప్యాకెట్లు కలిగి ఉన్న నలుగురు మహిళలను శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. పట్టణంలో ఎరుకుల వీధి జంక్షన్ వద్ద 600 సారా ప్యాకెట్లు కలిగి ఉన్న ఒడిశా రాష్ట్రంలో పొట్టంగి బ్లాక్ లావుడి గ్రామానికి చెందిన నలుగురు మహిళలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

న్యూస్ బాక్స్

సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి

కురుపాం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కురుపాంలో వచ్చే నెల 10, 11వ తేదీన జరుగనున్న సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో కురుపాం-రావాడ జంక్షన్ వద్ద వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, అవినాష్, మండంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పార్వతీపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగల కమిటేషన్ విషయంలో రికవరీని నిలుపుదల చేసిన కూటమి ప్రభుత్వానికి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు డీజీ ప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, సహాధ్యక్షుడు ధనుంజయరావ్, చౌదరినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నారని, ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అదే విధంగా ఉన్నతాధికారులకు తమ సంఘం కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు.

చేప పిల్లల పంపిణీ

సీతంపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో కీసరజోడు, దిబ్బగూడ, బొక్కిడుగూడ, నడిమిగూడ, తాబేలవలస గ్రామాల్లోని గిరిజన రైతులకు చేపపిల్లలను పంపిణీ చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల పరిధిలోని 11 చెరువుల్లో 41,900 చేపపిల్లలను చెరువుల్లో విడిచిపెట్టారు. ఐటీడీఏ ద్వారా శతశాతం సబ్సిడీతో ఈ చేపపిల్లలను గిరిజన రైతులకు అందిస్తున్నట్లు ఫిషరీస్ అసిస్టెంట్ విజేత తెలిపారు. సచివాలయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

కరాటేలో యాగ్నిక్ ప్రతిభ

సీతంపేట రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యాగ్నిక్ అనే బాలుడు అండర్ ఏజ్ కేటగిరీ కరాటేలో అద్వితీయ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 24వ తేదీన విశాఖపట్నంలో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఐదేళ్ల ప్రాయంలో ఇంతటి ప్రతిభ కనబరిచిన గిరిజన బాలుడు యాగ్నిక్‌ను తల్లిదండ్రులు, గ్రామస్థులు, కోచ్ సింహాచలం శుక్రవారం అభినందించారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

వీరఘట్టం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితకుమారి అధ్యక్షతన శుక్రవారం లింగ వివక్షతపై ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కె.రాము, హెచ్‌డీ ఉదయ్‌కుమార్, ఎఫ్‌పీవో సీసీ ఆనంద్, మండల సమాఖ్య సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.